# అమృతఝురి

"మనం జీవితంలో ఎందరినో కలుస్తాం.. అలాగే మన కెందరో తారసపడతారు... కానీ అందరూ జీవితాంతం మనతో రారు.. అయితే అందులో కొందరి పరిచయం అమృత ఝురిలా తీయగా, మలయమారుతంలా హాయిగా మనల్ని అలరిస్తుంది..." - ఎపుడో ఒకసారి రేడియోలో ప్రసారమైన ఓ నాటకానికి నాందిగా చెప్పిన మాటలవి.... నాకిప్పటికీ గుర్తున్నాయి.

అందులో ఎంతటి నిజముంది?....

అసలు కొన్ని నిజాలు నిజాలని చాలా మందికి తెలిసినా తేలిగ్గా తీసుకుంటారు... కానీ ఆ నిజాలే అనుభవంలోకి వచ్చినప్పుడు మనసంతా ఎందుకో ఆరాటంతో నిండిపోతుంది... గుండె అంచులమాటున గూడుకట్టుకున్న బాధ - అది తీయని బాధే కావచ్చు - వెచ్చని కన్నీటిగా కరగి కళ్ళల్లో నిలుస్తుంది... ఆ కళ్ళు మూసుకుంటే - మూసిన గతం గది తలుపులు తెరుచుకుని - పాత జ్ఞాపకాలు హృదయపు వాకిటి ముందు నిలబడతాయి.

కొన్ని జ్ఞాపకాలు ఆవేదనను కలిగిస్తే - మరికొన్ని ఆ వేదననంతటినీ మరపించి - తెలిమంచు లాంటి ఆనందపు కర్పూరాన్ని వెలిగిస్తాయి... కొన్ని మనసును రగిలిస్తే మరికొన్ని మనసును ఊరడిస్తాయి.

జీవితాంతం జ్ఞాపకాలే కనుక మనిషికి తోడుగా రాకపోతే ఆ మనిషి ఏం కావాలి?

ఎక్కడో పుడతాం... మరెక్కడో పెరుగుతాం... చివరి కెక్కడో రాలిపోతాం... అనంతకోటి విశ్వంలో... ఎన్నోజన్మల పరిమాణంలో - ఈ మానవజన్మ ఎన్ని క్షణాలు? ఈ ఒకటి రెండు క్షణాల్లోనే ఎంతటి ఆత్మీయతలు? ఎన్ని వేల అనుబంధాలు?

నవమాసాలూ మోసి, కని, కళ్ళల్లో పెట్టుకుని పెంచే కన్నతల్లి మరుజన్మలో మనకు ఏమవుతుంది?...

ఒకరి చేయి మరొకరు పుచ్చుకొని ఏడడుగులు ఒకరితో ఒకరు నడచి జన్మ జన్మలకైనా 'నాకు నువ్వూ - నీకు నేనూ' అనుకునే దంపతు లిద్దరూ, మళ్ళీ జన్మలో ఎవరికే మవుతారు?...

పట్టాలు పుచ్చుకొని, పరిశోధనలు చేసి, తన మేధస్సునంతా ఉపయోగించి ఎన్నో వింతలూ, విశేషాలూ కనిపెట్టి - బిరుదులూ సన్మానాలూ పొందినా - మళ్ళీ జన్మలో - మానవజన్మే పొందితే - మరోసారి ఓనమాలు నేర్చుకోవాల్సిందేగా?....

బ్రతికినన్నాళ్ళూ బ్రతికి - చివరకు మట్టిలో కలసిపోవాల్సిందే! మనిషికీ మట్టికీ ఎంతటి అవినాభావ సంబంధం వుంది?....

ప్రతి దీపావళికీ, అమ్మ వెలిగించి వీధిగుమ్మంలో అలంకరించే ప్రమిదల్ని చూనిప్పుడల్లా అలాగే నేను అనుకునేవాడ్ని... మట్టిని ప్రమిదగా చేసి, అందులోనూనె పోసి, వత్తి వేసి వెలిగిస్తే అది నిండుగా కనిపిస్తుంది... నూనె అయిపోగానే కొండెక్కిపోతుంది!

ప్రమిద లాంటి మనిషిలో కూడా నూనె లాంటి ఊపిరి ఉన్నంతవరకూ జ్యోతి లాంటి ప్రాణం వెలుగుతూనే వుంటుంది. ఊపిరి కాస్తా పోగానే, ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోతుంది....

ఇపుడు శ్యామల వెలిగిస్తున్న ప్రమిదలను చూస్తున్నా - నాకు అలాగే అనిపిస్తోంది.

నారింజరంగు పట్టుచీర కట్టుకుంది శ్యామల. జడ వదులుగా అల్లుకుంది. మా యింటిచుట్టూ వున్న ప్రహారీగోడ మీద ప్రమిదల్ని పెడుతోంది. దీపావళి సంరంభమంతా శ్యామల కన్నుల్లోనే తారట్లాడుతోంది.

పక్కవాళ్ళ పిల్లలతో అరుణ ఏమి టేమిటో కబుర్లు చెప్పేస్తోంది. మూడేళ్ళు కూడా నిండని అరుణ అలా కళ్ళూ చేతులూ తిప్పుకుంటూ మాట్లాడుతూంటే నాకూ శ్యామలకూ ముచ్చటేస్తుంది. 'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నట్టు, మా అమ్మాయి కనుకనే మా కలా ముచ్చటేస్తుందో - లేకపోతే అరుణను గమనించే వారందరికీ అలాగే అనిపిస్తుందో తెలీదు....

వుండివుండి టపాకాయల చప్పుళ్ళు మరీ దగ్గరగా వినిపిస్తున్నాయి. ఏదో సాధించాలనే ఆశతో వెర్రిగా పరుగులు తీసి - ఏమీ సాధించలేక అలసటతో కూలబడే ఆశాజీవుల్లా తారాజువ్వలు - అక్కడక్కడ ఎగురుతున్నాయి.

ప్రమిదలు వెలిగించటం పూర్తికాగానే, అరుణచేత దివిటీలు కొట్టించింది శ్యామల.... అప్పటికే ప్రక్క ఇంటివాళ్ళ పిల్లలిద్దరూ మతాబులు కాల్చటం ప్రారంభించారు. అరుణ కూడా లోపలకు పరుగెత్తి - బాణాసంచా వున్న బుట్టను తీసుకొచ్చింది.

నేను కూర్చున్న కుర్చీ పక్కనే, తన బుట్టను పెట్టి, అందులోంచి ఓ విష్ణుచక్రాన్నీ తీగపుల్లనూ తీసి - "నాన్నా ! ఇవి కాల్చవూ?" అంటూ నా చేతిలో పెట్టింది.

"అమ్మ చేత కాల్పించుకో తల్లీ" అని నేను చెప్పాలను కుంటూండగానే - "ఇలారా అరుణా - నేను కాల్పిస్తాను" - అంది శ్యామల, గుమ్మం దగ్గర మరో కుర్చీ తాను కూడా వేసుకుని కూర్చుంటూ....

ఎంతో సంబరపడిపోతూ అమ్మ దగ్గరకు వెళ్ళిపోయింది అరుణ.

ఆ క్షణాన శ్యామల వచ్చి అలా అని వుండకపోతే ఏమయ్యేది? ఆ బాణసంచాను కాల్పించమని అరుణ నా దగ్గర బుంగమూతి పెట్టుకొని గారాలు వెళ్ళబోసేది... కాదనీ, ఔననీ... చెప్పలేక నేను బాధ పడవలసివచ్చేది.

అయినా – నా మనసెందుకో ఆరాటపడుతోంది, బాధతో మెలితిరిగి పోతోంది. ఎవరితోనైనా చెప్పుకోవాలని మనసు చేసే ఆరాటం అది! తీయని జ్ఞాపకాల అనుభూతులకు ఆనవాలుగా మిగిలిన బాధ అది!

ఇప్పుడెవరితో చెప్పుకోవాలి?

ముప్ఫై ఏళ్ళ నా జీవితంలో - ఇంత వరకూ ఈ బాధని ఇద్దరికే చెప్పుకున్నాను. అప్పుడెప్పుడో ఓ సారి అమ్మకి ! ఈ మధ్య - అంటే పెళ్ళయిన కొత్తలో, మరోసారి శ్యామలకి.

ఇపుడు మళ్ళీ అరుణకు చెప్తే బాగుండేది. కానీ నా బాధను అర్థం చేసుకునే మనసూ వయసూ, రెండూ లేవు అరుణకు....

ఎపుడూ కాకపోయినా, దీపావళి రోజున మాత్రం నాకు 'సరోజిని' జ్ఞాపకానికి వస్తుంది!

అందంగా అలంకరించిన దీపాలు ప్రసరించే కాంతిరేఖల్నే అందరూ చూడగలుగు తారు. నాకు మాత్రం ఆ కాంతుల లోతుల్లో ఎక్కడో మసకమసకగా సరోజిని రూపమే కనిపిస్తుంది!

చిచ్చుబుడ్లూ, కాకర పువ్వొత్తులూ, మతాబులూ- వీటిల్లోంచి వచ్చే పువ్వులే అందరికీ కనిపిస్తాయి - కానీ, నా మనోఫలకం మీద ఎప్పటికీ చెరగిపోని సరోజిని చిరునవ్వుల ముందు ఆ పువ్వులు వెలవెలపోతున్నట్టే కనిపిస్తాయి.

సరోజిని నవ్వుతున్నపుడు బుగ్గలు సొట్టలుపడేవి. ఆ కళ్ళల్లో - కవులు కూడా వర్ణించలేని అందమే కనిపించేది.

సరోజిని తాసిల్దారుగారమ్మాయి ! అప్పట్లో.... అంటే పదిహేడు పద్దెనిమిది సంవత్సరాల క్రితం నాటిమాట - అప్పుడు.... సరోజినీ వాళ్ళూ మాఇంట్లో అద్దెకుండేవారు. నాకంటే సరోజిని రెండు క్లాసులు తక్కువే అయినా మేం ఇద్దరం ఒక బళ్ళోనే చదువుతూండటం వల్ల దాదాపు ప్రతిరోజూ బడికి కలిసే వెడుతూండే వాళ్ళం.

సరోజిని ఎంత అందంగావుండేదో అంత చురుగ్గానూ వుండేది. అపురూపమైన అందాన్నీ అంతకు మించిన తెలివితేటల్నీ యిచ్చిన ఆ భగవంతుడు ఎందుకో సరోజిని పట్ల నిర్ధాక్షిణ్యంగా ప్రవర్తించాడనిపిస్తుంది.

సరోజినికి మూడవ ఏటనే పోలియో వచ్చి కుడికాలు పడిపోయింది. అందుకే పాపం సరిగ్గా నడవలేదు.... బడికి తీసుకవెళ్ళటానికీ మళ్ళీ అక్కడ్నించి తీసుకరావటానికీ - ఓ

రిక్షాను ఏర్పాటు చేశారు వాళ్ళ నాన్నగారు - ఆయన తహశీల్దారు కనుక ఇంటినిండా పనిమనుషులుండేవారు. ఆ యింట్లో అందరికీ సరోజిని ప్రాణం.... నాకు మాత్రం సరోజిని అంటే అభిమానం....

ఒకటి రెండుసార్లు మా నాన్నగారు తాసిల్దారుగారికి చెప్పారు - 'రాయవెల్లూరు తీసుకెళ్ళి వైద్యంచేయిస్తే సరోజినికి కాలు వస్తుందేమో చూడమని' ....! కానీ ఎక్కడకు తీసుకెళ్ళినా ప్రయోజనం లేకపోయింది. వయసు మరికాస్త ముదిరిన తర్వాత ఆపరేషన్ చేసి కొయ్యకాలు లాంటిది ఏర్పాటు చేయవచ్చునని డాక్టర్లు సలహా ఇచ్చారు...

ఆ తరువాత ఓసారి.... మా ఊరికి ఓ స్వామీజీ గారొచ్చారు. ఎవరైనా ఆయన దగ్గరకు వెళ్ళి తమకున్న ఇబ్బందుల్ని చెప్పుకుంటే వాటికి పరిష్కార మార్గం చెబుతున్నారనీ పిల్లలు లేని వారికి పిల్లలు పుట్టటం కోసం మంత్రించిన విభూతి ఇస్తున్నారనీ - రకరకాలుగా చెప్పుకున్నారు.

ఆయనలో ఏదో మహత్యం వుండి వుండాలనిపించింది. లేకపోతే ఊళ్ళోని పెద్ద వాళ్ళంతా ఆయన గురించి ఎందుకలా చెప్పుకుంటారూ? సరోజినిని కూడా స్వామిజీగారి దగ్గరకు తీసుకెళ్ళి ఏ వీభూదైనా పెట్టిస్తే - ఆమె కాలు బాగు పడవచ్చుననే ఆశ కనిపించింది నాకు.

అందుకే ఓ రోజు బడి అయిపోగానే - నేనూ సరోజినీ మావూరి సత్రంలో మకాంచేసిన స్వామీజీగారి దగ్గరకు వెళ్ళాం.... అక్కడికి రావటానికి, సరోజిని ముందు భయపడింది. నేను ఎలాగో నచ్చచెప్పి తీసుకెళ్ళాను.

నా కిప్పటికీ బాగా గుర్తుంది.... స్వామీజీగార్ని చూడగానే, అప్రయత్నంగా నాకెందుకో కళ్ళుచెమర్చాయి... బహుశా ఆయనలో ఏదో శక్తి వుండి వుండాలి. లేదా ఆ నమ్మకమైనా నాలో వుండి వుండాలి.... అదీ కాకపోతే - నా 'వీక్నెస్' అయివుండాలి.... ఎందుకంటే - ఇంత వయసొచ్చినా ఇప్పటికీ అలాంటి సందర్భాల్లో నాకళ్ళు చెమరుస్తాయి.... గట్టిగా ఏడవాలనిపిస్తుంది....

ఓసారి ఆగ్రా వెళ్ళి నపుడు - అందమైన తాజ్‌మహల్ని వెన్నెట్లో చూసినప్పుడు-

మరోసారి తిరుపతిలో శ్రీనివాసుని దివ్య మంగళ విగ్రహాన్ని చూసినపుడు-

ఇంకోసారి ఎమ్మెస్ రామారావ్ పాడిన 'ఈ విశాల ప్రశాంత ఏకాంత సమయంలో' అనే పాట విన్నపుడూ-

అప్పట్లో - నడవలేక నడిచే సరోజినిని చూసినపుడూ, - ఇలా ఎన్నోసార్లు మనసు మూగగానే రోదించింది.

అపుడు స్వామిజీగార్ని చూడగానే - అందుకే నాకు కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. పులిచర్మం మీద కూర్చుని, అంతవరకూ ఏదో పుస్తకన్ని చదువుతున్న స్వామిజీగారు నన్నుచూసి-

"ఏం బాబూ! ఏం కావాలీ! ఎందుకు అలాఏడుస్తావ్?" అంటూ నన్ను దగ్గరగా తీసుకొని, అప్యాయంగా వీపు మీద రాస్తూ అడిగారు... వచ్చే దుఃఖాన్ని అతికష్టం మీద ఆపుకొని, సరోజిని కాలు సంగతి చెప్పాను...

క్షణం సేపు సరోజిని కళ్ళల్లోకి చూసి - 'ఇలా రా పాపా' అన్నారు స్వామిజీగారు.

బెదురుతూనే ఆయన దగ్గరికి వెళ్ళింది సరోజిని. ఓసారి ఆమెకాలుపై తమచేత్తో పై నుంచి క్రింది వరకూ రాసి ఆ తర్వాత ఆమె రెండు అరచేతుల్నీ పరిశీలనగా చూశారు.

'మా సరోజినికి కాలువస్తుందాండీ?' ఆశగా అడిగాను.

స్వామీజీగారు చిన్నగా నవ్వేరు -

"దేవుడు నిన్ను చల్లగా చూస్తాడమ్మా! నీకు త్వరలోనే మంచి జరుగుతుంది" అంటూ పక్కనే వున్న విభూది తీసి ముందు సరోజినికీ, తర్వాత నాకూ పెట్టారు.

స్వామీజీగారి మాటలకు మేం ఇద్దరం ఒకరికంటే మరిఒకరం ఆనందంతో మురిసిపోయాం. అంతగా నేను ఆనందించటానికి కారణం ఏమిటో, సరోజినికి కాలు రావాలని నేనెందుకు కోరుకున్నానో, ఆ వయసులో నన్నడిగితే నేనేమీ చెప్పివుండ లేక పోయేవాణ్ణేమో?

కానీ.... స్వామీజీగారి మాటలు వృధాపోలేదు. ఆయన దీవెన నిజమయింది.

ఆ రోజు దీపావళి!....

నాన్నగారు తెచ్చిన బాణసంచాను ఆ ఉదయం ఎండలో పెడుతూంటే - సరోజిని నన్ను పిలిచింది. వెళ్ళాను.

ఎర్రటి పట్టు పరికిణీమీద ముదురు నీలరంగు సిల్కు జాకెట్టు వేసుకుంది.ఆ బట్టల్లో సరోజిని ఎంతో ముద్దుగా కనిపించింది. ఎపుడూ రెండు జడలు వేసుకునే సరోజిని, ఆ రోజు తలంటు పోసుకోవటంవల్ల - వదులుగా ఒక్కటే జడ వేసుకుని, చివర రిబ్బన్‌తో ముడి వేసుకుంది. ఆ జడలోంచి తప్పించుకున్న ఒకటి రెండుపాయలు చెవుల మీద పడుతూంటే, వాటిని వెనక్కితీసుకుంటూ -

"కొత్తబట్టలు కుట్టించుకున్నాను చూశావా?" అని అడిగింది.

"బాగున్నాయ్!" అన్నాను.

"మీ నాన్నగారు ఏవేం కొన్నారు?" అడిగింది సరోజిని.

"పాలకోవా, లడ్డూలు, కొన్నారు. మా అమ్మకు చీర కొన్నారు. నాకేమో కొత్త బట్టలు కుట్టించారు. అనక కట్టుకుంటాను."

"వాటి విషయం కాదు నేనడిగేది. టపాకాయలూ - చిచ్చుబుడ్లూ..."

"ఓస్! అవా?... చాలా కొన్నారు. అవన్నీ ఎండలో పెట్టానుగా!"

"మా నాన్నగారుకూడా బోలెడుకొన్నారు. విమానాలూ, ఔట్లు కాల్చటమంటే నాకు భయం... నువ్ కాల్పిస్తావా?" అమాయకంగా అడిగింది సరోజిని.

నిజం చెప్పాలంటే ఔట్లు కాల్చటం నాకూ భయమే!... కానీ సరోజిని ముందు నా భయాన్నీ, ఆ భయాన్ని అంటిపెట్టుకున్న అసమర్థతనీ, ఒప్పుకోవటం ఇష్టం లేక 'సరే' అన్నాను.

ఆ రాత్రి దీపాలు పెట్టగానే నా బాణసంచా తీసుకుని సరోజిని దగ్గరకు వెళ్ళాను. గుమ్మం ముందు చిన్న 'గార్డెన్ కుర్చీ' వేసుకుని కూర్చుంది సరోజిని.

"నువ్ దగ్గరుండి మా సరోజ చేత కాల్పించవోయ్ మధూ" అన్నారు తాసిల్దారుగారు.

సీమటపాకాయలూ-ఔట్లూ ఎలాగో ధైర్యం చేసి అంటించాను... మధ్య మధ్య, భూచక్రాలూ, విష్ణు చక్రాలూ కాలుస్తున్న సరోజినికి సాయపడుతున్నాను.

తను విష్ణుచక్రాన్ని పట్టుకుంటే నేను కాకరపువ్వొత్తి వెలిగించి దాంతో ఆ విష్ణు చక్రాన్ని అంటించాలని ప్రయత్నిస్తున్నప్పుడు సరోజిని అంది-

"నేను పెద్దదాన్నయ్యేవరకూ- టపాకాయలూ అవీ, నువ్వే నాచేత కాల్పించాలి" అని!

"ఓ యస్!" అన్నాను....

"నేను నడవలేనుగా మరి! పైగా క్రింద ఎక్కడైనా కాల్చిపారేసినవాటికి నిప్పుంటే నా కాళ్ళు కాలతాయిగా?... అందుకని నే నిలా కుర్చీలోనే కూర్చుంటాను... నువ్వే అన్నీ కాల్పించాలి-" సరేనా, అన్నట్లు చూసింది నావైపు...

"అలాగే !... ప్రతి దీపావళికీ మనిద్దరం కలిసే కాల్చుకుందాం" అన్నాను...

"ఒట్టేనా?"

"ఒట్టు!".... ఒట్టంటే అదేదో బలమైన మాటనీ, దానికి కట్టుబడి వుండకపోతే ఘోరం జరిగిపోతుందనీ అనుకునే వయస్సు మాది!

మేం ఇద్దరం అలా బాణాసంచా కాలుస్తూంటే - చూసి, తాసిల్దారుగారు ఎక్కడికో బయటకు వెళ్ళిపోయారు... ప్రమిదల్లో నూనె పోస్తూ వత్తులు సరిచేస్తోంది అమ్మ.... సరోజినీ వాళ్ళ అమ్మగారూ గుమ్మంలో నిలబడి మమ్మల్ని చూస్తూనే వున్నారు.

అంతలోనే ఆ సంఘటన!

కన్నుమూసి తెరచేలోగా జరిగి పోయింది ఓ దుస్సంఘటన! కుర్చీలో కూర్చుని వున్న రోజిని కాకరపువ్వొత్తితో విష్ణుచక్రాన్ని వెలిగించబోయింది. ఒక్కసారిగా ఆ విష్ణుచక్రం ంటుకొని అందులోంచి జారిన ముత్యాలు - సరోజిని ఒడిలో పడ్డాయి. ఆమె ఖంగారుపడి...

మరోచేతిలో వున్న కాకరపువ్వొత్తిని కూడా వదిలేసింది. అది కూడా ఒళ్ళోనేపడి సరోజిని కట్టుకున్న పట్టుపరికిణి అంటుకుంది.

ఈ హఠాత్సంఘటనకు హడలిపోయిన సరోజినికి ఏం చేయాలో తోచక, కుర్చీలోంచి క్రిందకు దూకేసింది. నేను శిలాప్రతిమలా, అలా చూస్తూండిపోయాను తప్ప, ఏమి చేయటాన్కి ప్రయత్నించలేకపోయాను.

సరోజిని అలా క్రింద పడటంలో – నా బాణసంచా వున్న పళ్ళెం మీద పడింది. అవన్నీ ఒక్కసారిగా అంటుకున్నాయి. సరోజిని ఏడుపు... నా కేకలు... గందరగోళం... క్షణాల్లో అక్కడంతా భీభత్సమయిపోయింది.

చుట్టుప్రక్కల వాళ్ళందరూ వచ్చి చేరారు. అప్పటికే జరగవల్సింది జరిగి పోయింది. ప్రాణాపాయ స్థితిలో వున్న సరోజినిని అప్పటికప్పుడు మేమంతా హాస్పిటల్‌కి తీసుకెళ్ళాం... తాసిల్దారు గారికోసం మనుషుల్ని పంపించాం... ఆయన వచ్చేసరికే సరోజిని చనిపోయింది... సరోజినీ వాళ్ళఅమ్మగారయితే ఎంతగా విలపించారో నేనిపుడు వర్ణించ రాయలేను. కానీ అలా ఎందుకు ఏడ్చారో ఇపుడు చెప్పగలను... పాపం ఆవిడకు మరి పిల్లలు కలిగే అవకాశం లేదట!...

స్వామిజీగారు చెప్పినట్లు... దేవుడు సరోజినిని చల్లగా చూశాడు. అందుకే సరోజిని వళ్ళు చల్లబడిపోయింది. ఆయన ఆశీర్వదించినట్లు సరోజినికి మంచే జరిగింది. అందుకే కుంటి బ్రతుక్కి స్వస్తి చెప్పి మరో మంచి జన్మకోసం ఆశపడి. మరో లోకానికి వెళ్ళిపోయింది...

కానీ, సరోజిని నాచేత వేయించుకున్న ఒట్టు మాత్రం నాలో నిలిచిపోయింది. నిలిచి పోవటమే కాదు – వయసుతోబాటు అదీ పెరిగి పెద్దదైపోయింది. ఆ ఒట్టును తీసి గట్టున పెట్టాలంటే ఏదో దిగులు... దేవుడికి ద్రోహం చేస్తున్నాననేమోననే భయం...

ఆ దిగులూ ఆ భయమూ నన్నింతవరకూ సరోజినికిచ్చిన మాటను నిలబెట్టుకో నిచ్చాయి.

ఆ తర్వాత మళ్ళీ దీపావళి వచ్చింది...

నాన్నగారు బాణసంచా కొని తెచ్చారు. కానీ నేను మాత్రంకాల్చలేదు!

నేను కాల్చక పోవటానికి అమ్మ కారణమడిగింది... చెప్పాను. అలా చెప్పిన తర్వాత నా మనసు ఎంతో తేలిక పడింది... మళ్ళీ ఏ దీపావళికీ బాణ సంచా కాల్చమని నన్ను మా వాళ్ళెవరూ ఒత్తిడి చెయ్యలేదు...

కానీ పెళ్ళయిన కొత్తలో – మొదటి సారి నేను దీపావళికి అత్తవారింటికి వెళ్ళినప్పుడు మా బావమరదులు నా వెంటపడి తారాజువ్వలు వెయ్యమన్నారు. నేనేమీ కాల్చకపోవటంతో 'కోపమొచ్చిందా?" అని శ్యామల నన్ను రహస్యంగా అడిగింది....

మళ్ళీ మరోసారి సరోజిని కథంతా ఆ రాత్రి శ్యామలకు చెప్పాను. సరోజినిపై ఎంతో జాలిపడింది శ్యామల.

'సృష్టిలో తియ్యనైనది స్నేహమేననీ, ఆ స్నేహం శాశ్వతమైనదనీ' - నన్ను ఓదార్చింది.

మళ్ళీ ఇప్పుడు అరుణకు ఈ కథంతా చెప్తే బాగుండేది... చిన్న పిల్ల... దాని కేం తెలుస్తుంది?... తెలిసినా నన్ను ఎలా ఓదారుస్తుంది?...

కానీ ఎవరు ఓదార్చినా - ఎలా నచ్చచెప్పినా - దీపావళి వచ్చిందంటే నా మనసెందుకో ఆరాటపడుతుంది... బాధతో మెలితిరిగిపోతుంది... ఎవరితోనైనా చెప్పుకోవాలని మనసు చేసే ఆరాటం అది. తీయని జ్ఞాపకాల అనుభూతులకు ఆనవాలుగా మిగిలిన బాధ అది! జీవితాంతం కలిసి రాకపోయినా - గడచి పోయిన గతం తాలూకూ పుస్తకంలో మిగిలిపోయిన మధ్యపేజీలాంటి పరిచయం అది...

అమృతఝురిలా తీయగా, మలయ మారుతంలా హాయిగా అలరిస్తూనే వుంటుంది!

(స్వాతి)

---

జీడిగుంట రామచంద్రమూర్తి కథారచనలో సిద్ధహస్తుడు...
చక్కని శైలిలో హృదయస్పందనతో ఉత్తమ కథలు రచించారాయన...
సౌందర్యం, సందేశం కలిగిన కథలు ఆయనవి!

జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత
పద్మభూషణ్
డా॥ సి. నారాయణరెడ్డి
(గోదానం - కథాసంపుటి ఆవిష్కరణ సందర్భంగా)